క్లుప్తంగా

రోడ్డుపై చెత్త వేసిన వ్యక్తికి రూ.2వేల జరిమానా



చెత్త వేసిన వ్యక్తికి జరిమానా విధిస్తున్న సిబ్బంది

మీర్‌పేట: రహదారులు, ఖాళీ స్థలాల్లో చెత్త వేసే జరిమానాలు విధిస్తామని మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ అల్లూరి వాణి హెచ్చరించారు. కార్పొరేషన్ పరిధి మంత్రాల చెరువు సమీపంలోని ఆర్‌సీఐ ప్రధాన రహదారిపై చెత్తను వేసిన మహ్మద్ అక్బర్ అనే వ్యక్తికి శుక్రవారం శానిటేషన్ సిబ్బంది నర్సింహ, మహేందర్ రూ.2వేల జరిమానా విధించారు. కార్పొరేషన్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలంతా సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: అనారోగ్యంతో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా ఉంటుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి గ్రామానికి చెందిన సయ్యద్ మస్తాన్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జల్‌పల్లి మున్సిపల్ అధ్యక్షుడు షేక్ జహంగీరుద్దీన్ సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేయించారు. మంత్రి సిఫార్సు చేయడంతో బాధితుడికి రూ.లక్ష ఎల్‌ఓసీ మంజూరయింది. ఇందుకు సంబంధించిన ప్రతులను మంత్రి శుక్రవారం బాధితుడికి అందజేసింది. ఈ సందర్భంగా బాధితుడు మంత్రితో పాటు జహంగీరుద్దీన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

చేవెళ్ల ప్రజాగర్జనను జయప్రదం చేయండి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్

కందుకూరు: కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, పీసీసీ ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడు జంగారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. మధ్యాహ్నం 12 గంటల వరకు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయానికి చేరుకుంటే అక్కడ నుంచి అక్కడి నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్దామని పిలుపునిచ్చారు.

రెగ్యులరైజేషన్‌పై కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల హర్షం

హుడాకాంప్లెక్స్: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఏళ్ల నుంచి ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న 566 మంది ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేసినందుకు ఎల్లప్పుడు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి ప్రభుదాస్ అన్నారు. శుక్రవారం ప్రభుదాస్ మాట్లాడుతూ.. 566 మందిని రెగ్యులరైజ్ చేసినందుకు సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్, ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, కార్యదర్శి డాక్టర్ నికోలస్‌లకు సిబ్బంది తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఏవీ రంగారెడ్డి, చైర్మన్ వెంకటేశ్వర్లు, మహిళా విభాగం కార్యదర్శి శ్రీలత తదితరులున్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

ఎంపీఓ రఘు



గౌరిపల్లి పంచాయతీ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీఓ, ఏఈ, తదితరులు

తలకొండపల్లి: అభివృద్ధి పనుల్లో నాణ్యతలో రాజీపడకుండా పనులు చేపట్టాలని ఎంపీఓ రఘు అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు మేరకు సిమెంట్, కాంక్రీట్, ఇసుక, స్టీల్, తదితర మెటీరియల్‌ను సమ పాళ్లలో వాడుతూ నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోనలి గౌరిపల్లిలో ఏఈ విద్యాసాగర్‌తో కలిసి పర్యటించారు. ఈ సదర్బంగా పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ అనురాధ, నరేందర్‌గౌడ్, మేట్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి గెలిపించుకుంటాం

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు అవకాశం కల్పించడంతో ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం బీఆర్‌ఎస్ జిల్లా మైనార్టీ నాయకుడు సయ్యద్ ఖలీల్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా సయ్యద్ ఖలీల్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ప్రజల అండదండలతో నాలుగవ సారి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు.

శ్రావణ సందడి



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వరాలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

శ్రావణ శుక్రవారం సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఈ రోజు లక్ష్మీ దేవిని పూజిస్తే సకల సౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ పూజల సందర్భంగా మహిళలు ఆలయాల్లో, గృహాల్లో కలశ స్థాపన చేసి అమ్మవారిని బంగారం, వెండి ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

– మహేశ్వరం జోన్ బృందం



తుక్కుగూడ: ప్రత్యేక అలంకరణలో వరలక్ష్మి దేవి

అంగన్‌వాడీల్లో ఆంగ్లం

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసి మౌలిక వసతులు కల్పిస్తోంది. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందిస్తోంది. ఇందుకు టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందిస్తున్నారు. చిన్నారుల బంగారు భవిష్యత్‌కు అంగన్‌వాడీలు బలమైన పునాది వేస్తున్నాయంటూ పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఎల్‌కేజీ నుంచే చిన్నారులకు ఇంగ్లిష్ మీడియంలో బోధన
- ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు



దుబ్బచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఇంగ్లిష్ మీడియంలో భోదిస్తున్న ఉపాధ్యాయురాలు

మహేశ్వరం: కాలానిగుణంగా విద్యారంగంలోనూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఆంగ్ల మాధ్యమం తప్పనిసరి చేయనుంది. దీంతో విద్యార్థికి పూర్వ ప్రాథమిక విద్య బలంగా ఉండేందుకు గతేడాది నుంచి అంగన్‌వాడలో ఆంగ్ల మాధ్యమ బోధన ప్రారంభించింది. రంగుల బొమ్మలు, అక్షరాలతో కూడిన పుస్తకాలను తీసుకొచ్చారు. అంగన్‌వాడి కేంద్రాల్లో వీటిని సద్వినియోగం చేసుకుంటే పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా మరింత రాణించే అవకాశం ఉంది.

'ఎల్‌కేజీకి తంగేడు పువ్వు, యూకేజీకి పాలపిట్ట'

ఆంగ్ల పుస్తకాలతో పాటు ఎల్‌కేజీ చిన్నారుల కోసం 'తంగేడు పువ్వు' పేరుతో నాలుగు పుస్తకాలు, యూకేజీ వారికి పాలపిట్ట పేరుతో ఐదు పుస్తకాలు రూపొందించారు. చిన్నారులకు తెలుగు, ఆంగ్లం, పరిసరాలపై అవగాహన, గణిత భావనలను నేర్పించేలా రంగురంగుల బొమ్మలతో వీటిని రూపొందించారు. తెలుగు అక్షరాలు, భాషను నేర్పేలా యూకేజీలో భాషా పరిచయం అనే పుస్తకం రూపొందించగా.. పరిసరాల వినియోగం, మన చుట్టూ ఉన్న వనరులపై వివరిస్తూ నేను నా పరిసరాలు, పేరుతో ఎల్‌కేజీలో పుస్తకం రూపొందించారు. గణితంపై పట్టు సాధించేందుకు గాను చిన్నది, పెద్దది ఎక్కువ, తక్కువ, రంగులు వేయడం, ఆకారాలు, బరువు, పొడవు, తేడాలు గుర్తించడం తదితర పాఠ్యాంశాలను రూపొందించారు.

పదాలు పట్టు పట్టేలా...

నాలుగు నుంచి ఐదేళ్ల పిల్లల కోసం(యూకేజీ) ఆంగ్ల భాషకు సంబంధించిన రైన్‌బో-2 పుస్తకం ఇది ప్రతీ అక్షరం ఎలా రాయాలో బొమ్మలు, రాత గడుల ద్వారా వివరించారు. ఎల్‌కేజీలో అక్షరాలు రావడంతో ఇందులో చిన్న చిన్న పదాలు నేర్చుకునే విధంగా అవగాహన కల్పించారు. అన్ని అక్షరాలకు సంబంధించిన పదాలు, చిన్న వాక్యాలు, చిన్న కథలు(స్టోరీలు) రూపొందించారు. దీంతో ఇంగ్లిష్‌పై ఇప్పటి నుంచే పట్టు సాధిస్తారు.

ఎల్‌కేజీలో ఆంగ్ల అక్షరాలు

ఇది అంగన్‌వాడీలో చదివే ఎల్‌కేజీ(మూడు నుంచి నాలుగేళ్ల వయస్సు) పిల్లల కోసం రూపొందించిన రైన్‌బో-1, ఇంగ్లిష్ పుస్తకం. ఇందులో ఆంగ్ల అక్షరాలను పరిచయం చేశారు. ప్రతీ అక్షరానికి సంబంధించిన రంగురంగుల చిత్రాలు, వీటిని డ్రాయింగ్ చేసేకునేందుకు వీలుగా పెన్సిల్‌తో మార్కు చేశారు. ఒక్కో అక్షరానికి ఒక పాఠం తీసుకొని ఇదే అక్షరంతో వచ్చే ఇతర పదాలు, వీటి బొమ్మలు, దీనిలో పెద్ద, చిన్న అక్షరాలు, రైమ్స్‌తో ఆకర్షణీయంగా రూపొందించారు.

205 కేంద్రాల్లో బోధన



మహేశ్వరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 205 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంగ్లిష్ మీడియం బోధన కొనసాగుతోంది. ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు వేర్వేరుగా బోధన ఉంది. 3 సంవత్సరాల నుంచి 4 వరకు ఎల్‌కేజీ, 4 నుండి 5 సంవత్సరాల వరకు యూకేజీ తరగతులుగా విభజించాం. తెలుగు, భాషా పరిచయం, అంకెలు, ఆటలు, పాటలు, కథలు, శాస్త్రీయ పరిజ్ఞానం వంటి సబ్జెక్టులు ఉన్నాయి. 3 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి.

– షభానా, ఐసీడీఎస్ సీడీపీఓ, మహేశ్వరం

ప్రజా పోరాట స్ఫూర్తి గద్దర్

'యుద్ధనౌక' సంస్మరణ సభలో వెన్నెల



మాట్లాడుతున్న వెన్నెల

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలో చిర్ర లింగమయ్య ఆధ్వర్యంలో గురువారం రాత్రి గద్దర్ సంస్మరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గద్దర్ కూతురు వెన్నెల, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మేయర్ పారిజాత తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వెన్నెల మాట్లాడుతూ.. తన తండ్రి ప్రజల కోసం పోరాడే స్ఫూర్తిని నింపారని అన్నారు. ఆయన చూపిన అడుగుజాడల్లో నడుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రభాకర్‌రెడ్డి, దర్శన్‌రెడ్డి, జగన్, మల్లేశ్, పలువురు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేద్దాం

పీసీసీ ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడు జంగారెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

కందుకూరు: కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా కృషి చేయాలని పీసీసీ ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిప్పలపల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పలువురు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ నాయకుడు సరికొండ మల్లేశ్, కాంగ్రెస్ నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, బొక్క భూపాల్ రెడ్డి, ఎండీ అఫ్జల్‌బేగ్, సయ్యద్ అజీజ్, డి.నర్సింహాచారి, పాండురంగారెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు

పహాడీషరీఫ్: ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ల ముట్టడికి బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన నేపథ్యంలో పహాడీషరీఫ్ పోలీసులు పార్టీ నాయకులను ఉదయం అదుపులోకి తీసుకున్నారు. మాజీ కౌన్సిలర్ ఈరంకి వేణుకుమార్ గౌడ్, సీనియర్ నాయకులు ఎనగండ్ల శ్రీధర్‌గౌడ్, సుధాకర్, రాకేష్, రాజు తదితరులను మధ్యాహ్నం అనంతరం వదిలిపెట్టారు.

అనాథ విద్యార్థిని ఆదుకోండి

- డాక్టర్ కోర్సు చదివేందుకు ఆర్థిక సాయం చేయండి
- అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు రాజేష్ విజ్ఞప్తి



రమావత్ హనుమ

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలో అనాథ విద్యార్థి గృహం విద్యార్థి డాక్టర్ కోర్సు చదివేందుకు ఆర్థిక చేయూత కోసం ఎదురు చూస్తున్నాడు. గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా, పెద్దవూర మండలం, బాసోని బావి తండాకు చెందిన రమావత్ హనుముకు చిన్నప్పుడే తండ్రి చనిపోయాడు. పేదరికం వల్ల తల్లి చదివించే స్థితిలో లేకపోవడంతో ఎల్‌బీనగర్‌ను అనాథ విద్యార్థి గృహంలో చేరాడు. గృహంలో ఉంటూ పదో తరగతిలో 97 శాతం మార్కులు, ఇంటర్మీడియేట్‌లో 97 శాతం మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. అనంతరం నీట్ ఎంట్రెన్స్ పరీక్షలో 484 మార్కులతో ఆలిండియా ఎస్టీ కేటగిరీలో 1170 ర్యాంకు సాధించాడు. సూర్యపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది.ఈ కోర్సు చదివేందుకు మొదటి సంవత్సరానికి రూ.57 వేలు, ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసేందుకు హాస్టల్, భోజన, పుస్తకాలు, ఇతర ఖర్చులకు రూ. 2.15 లక్షలు అవసరమవుతాయి. సీటు రిజర్వ్ చేసుకోవడానికి ఈ నెల 26 తేదీలోపు సూర్యపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీకి రూ. 39 వేలు చెల్లించాల్సి ఉంది. అంత డబ్బు కట్టలేక రమావత్ హనుమ దాతల సాయం కోరుతున్నాడు. సర్వస్వతీ పుత్రుడైన హనుము ఉన్నత చదువులు కొనసాగించడానికి దాతలు ముందుకొచ్చి ఆర్థిక సహాయం చేయాలని మార్గం రజేష్ కోరారు. ఇతర వివరాలకు 9985720394లో సంప్రదించాలన్నారు.

గౌడ సంక్షేమ సంఘం ఎన్నిక ఏకగ్రీవం



గౌడ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు

కందుకూరు: గౌడ సంక్షేమ సంఘం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రస్తుత అధ్యక్షుడు పిరాటి సిద్దేశ్వర్‌గౌడ్ అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకుని ప్రకటించారు. అధ్యక్షుడిగా తిమ్మాపూర్‌కు చెందిన సరికొండ వెంకటేష్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మల్లయ్యగౌడ్, అంజయ్యగౌడ్, సదానంద్‌గౌడ్, నరేందర్‌గౌడ్, దశరథగౌడ్, దేవేందర్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్, ఉపాధ్యక్షులుగా దశరథగౌడ్, యాదయ్యగౌడ్, శంకరయ్యగౌడ్, ప్రభాకర్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, ప్రభాకర్‌గౌడ్, ప్రధానకార్యదర్శులుగా శ్రీనివాస్‌గౌడ్, దామోదర్‌గౌడ్, కార్యదర్శులుగా సత్యనారాయణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాకేష్‌గౌడ్, మహేందర్‌గౌడ్, రవీందర్‌గౌడ్, రవిగౌడ్, సంయుక్త కార్యదర్శులుగా సురేష్‌గౌడ్, జి.వెంకటేష్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, శంకరయ్యగౌడ్, ఎ.అర్జున్‌గౌడ్, ఎస్.హరినాథ్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, కోశాధికారిగా పి.వెంకటేష్‌గౌడ్, జి.శివశంకర్‌గౌడ్, అధికార ప్రతినిధిగా ఐ.రాకేష్‌గౌడ్, లీగల్ సెల్ ప్రతినిధులుగా ఎం.శ్రీనివాస్‌గౌడ్, ఎస్.మురళీగౌడ్, ప్రచార సభ్యులుగా పి.సిద్దేశ్వర్‌గౌడ్, జి.రాములుగౌడ్, మల్లేష్‌గౌడ్, సోషల్‌మీడియా కన్వీనర్లుగా పి.మహేష్‌గౌడ్, బి.సాయికిరణ్‌గౌడ్, యూత్ అధ్యక్షుడిగా పి.శేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా నిమ్మల మహేందర్‌గౌడ్, బి.శ్రీనివాస్‌గౌడ్, టి.వెంకటేష్‌గౌడ్, రాములుగౌడ్, ప్రధానకార్యదర్శులుగా ఎ.నవీన్‌గౌడ్, పి.అక్షయ్‌గౌడ్, పి.దేవేందర్‌గౌడ్, కార్యదర్శులుగా శ్రీకాంత్‌గౌడ్, పి.శేఖర్‌గౌడ్, ఎం.దేవేందర్‌గౌడ్, ఎ.ప్రవీణ్‌గౌడ్, సలహాదారులుగా వి.కృష్ణయ్యగౌడ్, భూషణ్‌గౌడ్, పి.బాబుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సంజీవగౌడ్, ఎ.పాపయ్యగౌడ్, బాబుగౌడ్‌లను ఎన్నుకున్నామన్నారు.

ఆకట్టుకుంటున్న హ్యాండీ క్రాఫ్ట్ మేళా



మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురం హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆలిండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా వనస్థలిపురం, పరిసర కాలనీల ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు కాలనీల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, డిజైనర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, బనారస్, లక్నో చికాన్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్‌లు, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, గాజులు, హైదరాబాద్ ముత్యాలు, చెప్పులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు. మరో 3 రోజులు మాత్రమే మేళా కొనసాగుతుందన్నారు.

వైకేఆర్ డెవలపర్స్ చేయూత



విద్యార్థులకు బస్‌పాస్‌లు అందిస్తున్న డీఎం

హయత్‌నగర్: హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల బస్‌పాస్‌లకు చెల్లించాల్సిన రుసుం వైకేఆర్ డెవలపర్స్ అధినేత మదన్ రెడ్డి చెల్లించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో హయత్‌నగర్1 డిపో మేనేజర్ విద్యార్థులకు బస్‌పాస్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద విద్యార్థులకు చేయూత నందించడం ఎంతో ఆనందంగా ఉందని, ఇలాంటి కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉన్నత పాఠశాలకు చెందిన సుమారు 500 మంది, ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులకు బస్‌పాస్‌లు అందించారన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో శనివారం మంత్రి సబితారెడ్డి పర్యంటిచనున్నట్లు బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉంటాయన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు జల్‌పల్లి అర్బన్ ఫారెస్ట్‌లో ప్లాంటేషన్

పహాడీషరీఫ్: జల్‌పల్లి అర్బన్ ఫారెస్ట్ పార్కులో ఈ నెల శనివారం ఉదయం 11 గంటలకు మొక్కలు నాటే కార్యక్రమం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఎన్.వసంత తెలిపారు. మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొని మొక్కలు నాటాలని కోరారు.

ఇమామ్‌గూడలో..

తుక్కుగూడ: భారత వజ్రోత్సవాల్లో భాగంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఇమామ్‌గూడలో ఉదయం 11గంటలకు మొక్కలు నాటనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రాం శుక్రవరం ఓ ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు సకాలంలో హాజరవ్వాలని కోరారు.

'వికల్ప్'తో ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి



ట్రాన్స్‌జెండర్స్‌తో సమావేశమైన సీఐ కిరణ్‌కుమార్, ఎస్‌ఐలు

సీఐ కిరణ్‌కుమార్

మీర్‌పేట: విద్యార్హత, నచ్చిన రంగాల్లో ఆసక్తిని బట్టి ట్రాన్స్‌జెండర్లకు వికల్ప్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మీర్‌పేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం మీర్‌పేటలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌జెండర్ కౌన్సిలింగ్ సదస్సుకు సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్లు విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకుని సమాజంలో ఆత్మగౌరవంతో బ్రతకాలని, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ట్రాన్స్‌జెండర్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. సదస్సులో ఎస్‌ఐలు గోవిందుస్వామి, కె.సుధాకర్, వికల్ప స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఆలీ, పలువురు ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

భూములను కాపాడాలి

మంచాల: రియల్ వ్యాపారులు కబ్జా చేస్తున్న ప్రభుత్వ భూములను కాపాడాలని ఆగాపల్లి గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం మంచాల తహసీల్దార్ వెంకట్ ప్రసాద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో రియల్ వ్యాపారులు వెంచర్ల పేరుతో ప్రభుత్వ భూములను కబ్జా చేసి విక్రయిస్తున్నారని ఆరోపించారు.